క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ



మచిలీపట్నంటౌన్: నగర ప్రజలకు ఈ వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ తాగునీటి సరఫరా అధికారులను ఆదేశించారు. నగరంలోని హెడ్ వాటర్‌వర్క్స్‌ను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో తాగునీటి నిల్వలు, రోజువారీ నీటి సరఫరా వివరాలు, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి మేయర్ అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శివారు ప్రాంతాలకు కుళాయిల ద్వారా తాగునీరు అందకుంటే ఎప్పటికప్పుడు ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

క్రికెటర్లకు కిట్లు పంపిణీ



మచిలీపట్నంటౌన్: 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ అండర్ -17, 19 లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు సోమవారం క్రికెట్ కిట్లను అందజేశారు. కంచర్లపల్లి సతీష్ క్రీడాకారులకు వీటిని అందజేశారు. అండర్ -19 బాలుర విభాగంలో బెస్ట్ బ్యాట్‌మెన్‌గా వి.విఘ్నేశ్వర (కర్నూలు), బాలికల విభాగం ఎస్ఆర్ షియా (అనంతపురం), అండర్-17 బాలుర విభాగంలో బ్యాట్స్‌మెన్‌గా ఎస్.రేహాన్ (అనంతపురం), కృష్ణాజిల్లాకు చెందిన ఆల్‌రౌండర్ గీత్‌కృష్ణ, బెస్ట్ బౌలర్‌గా కార్తికేయ (విశాఖపట్నం) నిలిచారు. వారికి కిట్లు అందజేశారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ తోట అజయ్‌కుమార్, అండర్-19 బాయ్స్, గర్ల్స్ క్రికెట్ అబ్జర్వర్ హుకుం సింగ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **ఘంటసాల(అవనిగడ్డ):** ఘంటసాల మండల పరిధిలోని పెదగూడెంకు చెందిన జైజీవన్ టీంకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు సోమవారం క్రికెట్ కిట్‌ని అందించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కిట్ అందించినట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి దిరిశం పిచ్చేశ్వరరావు, పాస్టర్ చిన్నం దానియేల్, నడకుదురు రాజీవ్, దిరిశం శ్రీనివాసరావు, అంబటి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో రెండోరోజూ వర్షం



మచిలీపట్నంటౌన్: అల్పపీడనం కారణంగా మచిలీపట్నం నగరంలో రెండో రోజు సోమవారం కూడా ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచీ ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారితో పాటు పలు పల్లపు అంతర్గత రహదారులపైకి నీరు చేరింది. డ్రెయిన్ల ద్వారా వర్షపు నీరు నెమ్మదిగా తొలగటంతో ముంపు సమస్య తీరింది.

ఉపాధి పనుల్లో నాణ్యత పరిశీలన

మెరకనపల్లి(మోపిదేవి): జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులను జిల్లా క్వాలిటీ కంట్రోల్ బృందం సోమవారం పరిశీలించింది. మండలంలోని మెరకనపల్లిలో పంటకాలువ, కోసూరువారిపాలెం మునగతోటలు, కె.కొత్తపాలెం గ్రామంలో గృహ నిర్మాణ పనులు బృంద సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా క్వాలిటీ కంట్రోల్ టీమ్ ప్రతినిధి సురేష్ మాట్లాడుతూ.. గత మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ఉపాధి పనులు పరిశీలించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. టీఏ హరిబాబు నాయక్, బీఎఫ్‌టీ వెంకటేశ్వరమ్మ, మూడు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనకు సీఎం కృషి

● ఉత్తమ పంచాయతీలు మరింత పేరు తెచ్చుకోవాలి
● అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



అవనిగడ్డలో సర్పంచ్‌లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు

అవనిగడ్డ: మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గ్రామ పంచాయతీలు ముఖ్యమంత్రికి మద్దతుగా నిలవాలని కోరారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉత్తమ సేవలు అందించిన ఎనిమిది పంచాయతీలకు ఎమ్మెల్యే పురస్కారాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు చేరువ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న పాలన దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. విద్య, వైద్యం, పరిశుభ్రత, ఆరోగ్యంపై ఆయన తీసుకుంటున్న చర్యలు పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీ డీఓ శైలజతో పాటు పలువురు సర్పంచ్, కార్యదర్శులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీలు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, దిడ్ల కిరణ్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, పలువురు సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు ఘన సన్మానం

పెడన: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గ్రామ సచివాలయాల వద్ద సోమవారం మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ వచ్చినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఏ విధంగా తోడ్పడిందనే వివరాలను పంచాయతీ కార్యదర్శులు సచివాలయాల సిబ్బందికి వివరించారు. పలు సచివాలయాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని సచివాలయల పరిధిలో విధులు నిర్వహించే గ్రీన్ అంబాసిడర్ల (చెత్త సేకరించే కార్మికులు)ను ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శికి అభినందనలు

వెంకటాపురం(మోపిదేవి): జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలో ఉత్తమ పంచాయతీ అవార్డును వెంకటాపురం సర్పంచ్ తుమ్మా సోములమ్మ, పంచాయతీ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని వెంకటాపురం పంచాయతీని జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేశారు. మాజీ మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్ఓ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రసంశాపత్రం, అవార్డును సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అందుకున్నారు. సర్పంచ్ సోములమ్మ, కార్యదర్శి మాధవేంద్రరావుకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రావి దుర్గావాణి, ఎంపీడీఓ పార్వతితో పాటు పలువురు సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

నాగాయలంక: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరిగింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు అందజేశారు. పంచాయతీల విధులు, సేవల పనితీరు ఆధారంగా తొమ్మిది అంశాల్లో సేకరించిన సమాచారం ప్రాతిపదికగా మండలంలోని ఏడు పంచాయతీలకు 27 అవార్డులు అందించారు. అత్యధిక అంశాల్లో సంగమేశ్వరం పంచాయతీ అగ్రగామిగా నిలిచింది. తలగడదీవి, నంగేగడ్డ, సొర్లగొంది, చోడవరం, భావదేవరపల్లి, కమ్మనమోలు ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయి. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను ఎంపీపీ భోగాది రాఘవరాణి, మండల ప్రత్యేకాధికారి మైక్రో ఇరిగేషన్ పీడీ విజయలక్ష్మి చేతులమీదుగా సన్మానించారు. ఎంపీడీఓ వేమూరి శ్రీనివాసరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో ఉత్తమ సేవా పురస్కారాలు

బంటుమిల్లి: ప్రభుత్వం జిల్లా స్థాయిలో ప్రకటించిన జాతీయ పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ పురస్కారాలను మండలంలోని పెదతుమ్మిడి, కంచడం పంచాయతీలు అందుకున్నాయి. పెదతుమ్మిడి పంచాయతీకి సామాజిక భద్రత తదితర అంశాల్లో, పేదరిక నిర్మూలనతో పాటు పలు అంశాల్లో ఉత్తమ సేవలను అందించినందుకు కంచడం పంచాయతీకి ఉత్తమ పురస్కారాలు లభించాయి. మచిలీపట్నంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), కలెక్టర్ రాజాబాబు తదితరుల చేతుల మీదుగా సర్పంచులు అర్జా యశోదమ్మ, బండారు చంద్రశేఖర్ పురస్కారాలు అందుకున్నారు. మండల స్థాయిలో 11 పంచాయతీలకు పురస్కారాలను అందజేసినట్లు అధికారులు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

సర్పంచులకు సన్మానం

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు అంశాలపై ఎంపికైన సర్పంచులను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) వారిని సత్కరించారు. ముందుగా మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా క్షేత్రస్థాయిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చునన్నారు. స్థానిక సంస్థలు బలోపేతంగా ఉంటేనే దేశం బలోపేతంగా ఉంటుందన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాలకృష్ణారావు, మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి ఎ.పద్మనాభప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 9 ఉత్తమ పంచాయతీలు

మోపిదేవి: మండలంలోని 13 పంచాయతీల్లో 9 ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయని ఎంపీడీఓ పార్వతి తెలిపారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులతో పాటు గ్రీన్ అంబాసిడర్ల సన్మాన కార్యక్రమం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపికైన సర్పంచులు, కార్యదర్శులను సత్కరించారు. తొలుత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ అరుణకుమారి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పంచాయతీల పనితీరుకు పురస్కారాలే కొలమానం

గూడూరు: పంచాయతీల మెరుగైన పరిపాలనకు పురస్కారాలే కొలమానమని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ పనితీరు కనపర్చిన వివిధ పంచాయతీల సర్పంచ్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మంచి పనితీరు కనబరిచిన పంచాయతీలకు ప్రభుత్వం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పురస్కారాలు అందజేసిందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్‌రంగబాబు, వైస్ ఎంపీపీలు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, తలుపుల వెంకట కృష్ణారావు, ఎంపీడీఓ డి.సుబ్బారావు, ఈఓపీఆర్డీ రజావుల్లా, పలువురు ఎంపీటీసీ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పెరిగిన పంచాయతీల ఖ్యాతి

చల్లపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ పంచాయతీ వ్యవస్థ ఖ్యాతి పెంచారని జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మండలంలో పుష్కల నీటి వనరులు, ఆరోగ్యకర, క్లీన్ అండ్ గ్రీన్, స్వయం సమృద్ధి వనరులు, సామాజిక భద్రత, సుపరిపాలన, పేదరిక నిర్మూలన, జీవన ప్రమాణాలు మెరుగు విభాగాల్లో ఉత్తమ ప్రమాణాలతో పని చేస్తున్న పంచాయతీలకు పురస్కారాలు ప్రదానం చేశారు. చల్లపల్లి, పురిటిగడ్డ, వక్కలగడ్డ, పాగోలు, ఆముదార్లంక, నడకుదురు, లక్ష్మీపురం వరుసగా తొలి ఏడు స్థానాల్లో నిలిచాయి. ఆయా గ్రామాల సర్పంచ్‌లు వల్లూరు ఉమా, మాతంగి రమ్య, తోట శ్రీనివాసరావు, కార్యదర్శులు పడమట సుకుమార్, పిట్టి రాంబాబు, ఆకుల సాంబశివరావును ఎంపీపీ కోట విజయ రాధిక, జెడ్పీటీసీ సభ్యురాలు కల్యాణి, ఇంచార్జి ఎంపీడీఓ అరుణ కుమారి, ఈఓపీఆర్డీ బూరేపల్లి అశోక్ కుమార్ ఘనంగా సత్కరించి పురస్కారాలు ప్రదానం చేశారు. గ్రామ సచివాలయ కార్యదర్శులు మెరకనపల్లి నాగ వెంకట తిరుమలేష్, తిరువీధుల రాజశేఖర్, కొప్పుల అమర్‌నాథ్ పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలకు అవార్డులు

కృత్తివెన్ను: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సోమవారం గ్రామ సభలు నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి ఆయా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అవార్డులను ప్రదానం చేశారు. ఆరోగ్యం, పేదరిక నిర్మూలన, సామాజిక పరిశీలన, స్వచ్ఛమైన పరిశుభ్రత, మహిళల భద్రత తదితర అంశాలపై గతంలో నిర్వహించిన సర్వేల ఆధారంగా పంచాయతీలను ఎంపిక చేసి, అవార్డులు అందజేసినట్లు ఏఓ మధుసూదనరావు తెలిపారు. యండపల్లి, చెరుకుమిల్లి, మునిపెడ, నీలిపూడి, కొమాళ్లపూడి, లక్ష్మీపురం, మాట్లాం, నిడమర్రు, పడతడిక పంచాయతీలకు అవార్డులు వచ్చినట్లు ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు మార్కండేశ్వరరావు, నరసింహారావు, ఉమామహేశ్వరి, పలువురు సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సర్పంచ్ సోములమ్మ, కార్యదర్శి మాధవేంద్రరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని, కలెక్టర్ రాజాబాబు



అవార్డు అందుకుంటున్న పెదతుమ్మిడి సర్పంచ్ యశోదమ్మ



మచిలీపట్నంలో సత్కారం పొందిన సర్పంచ్‌లతో అధికారులు



పురస్కారాలు అందుకున్న సర్పంచులతో ఎంపీపీ సంగా మధు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్



చల్లపల్లిలో పురస్కారాలు అందిస్తున్న విజయరాధిక, కల్యాణి



కృత్తివెన్నులో అవార్డులు అందుకుంటున్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు

విద్వేషాలను రెచ్చగొడితే సహించం

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలను సహించేది లేదని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు స్పష్టంచేశారు. పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రత్యేక సభలో రమేష్‌బాబు మాట్లాడారు. ఆయా సామాజిక వర్గాల మధ్య తగువులు పెట్టే సంస్కృతి గ్రామాల్లో వ్యాప్తి చెందటం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. పట్టణ ప్రాంతాల్లో ఏవిధమైన భేదాలు లేకుండా ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవిస్తుంటే, కొంత మంది కులాల పేరుతో విద్వేషాలను పెంచుతున్నారని పేర్కొన్నారు. వీటిని ప్రోత్సహించే వారిపైన కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే రమేష్‌బాబు హెచ్చరించారు. అందరూ ఐకమత్యంతో కలిసి ఉండి, గ్రామాలు అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ పాలనను మరింత సులభతరం చేస్తూ సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేయడంతో పాటు గ్రామాల్లో ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాలను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం తొమ్మిది అంశాల్లో ప్రతిభ కనబర్చిన పంచాయతీలకు ఉత్తమ పురస్కారాలు అందించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయిలో ప్రకటించిన ఉత్తమ పురస్కారాలు తొమ్మిది పంచాయతీలకు లభించాయి. పంచాయతీల్లో జరిగే కార్యక్రమాలను ప్రభుత్వం తొమ్మిది విభాగాలుగా విభజించి పురస్కారాలను అందించింది. ఉల్లిపాలెం పంచాయతీకి ఏడు, హంసలదీవి, పోటుమీద పంచాయతీకి ఐదేసి, పిట్టల్లంక, విశ్వనాథపల్లికి మూడేసి, సాలెంపాలెం, మందపాకల, జయపురం, మాచవరంలకు ఒకొక్క పురస్కారం చొప్పున లభించాయి. ఉల్లిపాలెంనకు ఏడు పురస్కారాలు రావడంతో సర్పంచి వెర్రీ పావని, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పరిశె మాధవరావు, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ పాండురంగారావు, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వెంకటకుమారి, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి ఆరాధనోత్సవాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మందిరంలో బాబా ఆరాధనోత్సవాలను సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఓంకార సుప్రభాతం, నగర సంకీర్తన, జ్యోతిప్రజ్వలన కార్యక్రమాలను సేవా సంస్థల జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యసాయి పాదుకలకు అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పేదలకు దుస్తులు, పాదరక్షలు అందజేశారు. రెండు వేల మందికి మహానారాయణ సేవ (అన్నసంతర్పణ) నిర్వహించారు. సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్, ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ వై.సాయిబాబు, మహిళా ఇన్‌చార్జ్ కాళికాదేవి, కొట్టి నాగమణి పర్యవేక్షించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద, చిలకలపూడి అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో కూడా అన్నసమారాధన నిర్వహించారు. చలివేంద్రం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

చల్లపల్లి: మండల వనరుల కేంద్రంలో సోమవారం ఇన్‌చార్జి ఎంఈఓ కె.రాజ్ కుమార్ అధ్యక్షతన ప్రధాన ఉపాధ్యాయులకు పాఠశాల సామాజిక తనిఖీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మౌలిక సదుపాయాలు, అవసరాలు, ఉపాధ్యాయుల పనితీరు, ఈక్విటీ సూచికలు తదితర అంశలపై శిక్షణ ఇచ్చారు. జిల్లా సెక్టోరియల్ అధికారి ఏడుకొండలు, జిల్లా రిసోర్స్ పర్సన్ పి.జయంతి శిక్షణ ఇచ్చారు.

'జగనన్నే మా భవిష్యత్తు' చారిత్రాత్మకం

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం చారిత్రాత్మకమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఏడు లక్షల మంది గృహసారథులు రాష్ట్రంలో కోటి మంది ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై సర్వే చేయడం దేశంలో చరిత్ర సృష్టించిందన్నారు. ఈ కార్యక్రమానికి వెళ్తుంటే ప్రజలు ఎదురొచ్చి వారి ఇళ్లకు తీసుకెళ్లి జగనన్న స్టిక్కర్ అంటించాలని కోరుతున్నారని తెలిపారు. 'మా పిల్లలు ఆనందంగా బడికి వెళ్తున్నారు. ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్నారు. మధ్యాహ్నం మంచి భోజనం పెడుతున్నారు. అటువంటప్పుడు జగనన్నని ఎలా మర్చిపోతాం' అని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారని పేర్కొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే పింఛన్ అందించి ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ని ఎలా మర్చిపోతామని పింఛన్ల లబ్ధిదారులు అంటున్నారని వివరించారు. ఉచితంగా ఇళ్ల స్థలం ఇచ్చి, పక్కా గృహాలు కట్టిస్తున్న ముఖ్యమంత్రి మేలు మరువలేమని లబ్ధిదారులు స్పష్టంచేస్తున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగన్‌ని కాదని మరొకరికి అవకాశం ఇవ్వబోమని ప్రజలు సంతోషంగా చెప్పే మాటలు తమకు కొండంత బలాన్ని ఇస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమం అవనిగడ్డ నియోజకవర్గంలో 95 శాతం పూర్తయిందని తెలిపారు. మిగిలిపోయిన ప్రాంతాల్లో వెంటనే పూర్తి చేస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో 175 సీట్లు సాధించడం ద్వారా వైఎస్సార్ సీపీ మరో చరిత్ర సృష్టించనుందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెడన పట్టణంలో..

పెడన: పట్టణంలోని 16వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం సోమవారం జరిగింది. మునిసిపల్ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, పట్టణ సచివాలయాల సమన్వకర్త మతీన్‌ఖాన్ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి, గత ప్రభుత్వ పరిపాలన, ఇప్పటి సీఎం పరిపాలనలో జరిగిన వ్యత్యాసాలను వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు రౌతుల ప్రసాద్, కర్ణా శ్రీను తదితరులు పాల్గొన్నారు. నాలుగో వార్డులో కౌన్సిలర్ రహెతున్నీసా మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేయడంపై పార్టీ నాయకులు హర్షం ప్రకటించారు.

సీనియార్టీ జాబితాలో పేరు నమోదు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హులైన సెకండరీ గ్రేడ్, సరిసమాన క్యాడర్‌లో పనిచేసిన ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని డీఈఓ తాహెరాసుల్తానా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు సంబంధిత ధ్రువపత్రాలు, సర్వీస్ రిజిస్టర్‌తో ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు మచిలీపట్నంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.